క్లుప్తంగా

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



ప్రసూనశర్మ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ఎంఎస్‌వీఎల్ ప్రసూన శర్మ దంపతులు స్థానిక ఆర్ఆర్ నగర్‌లోని తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా సంక్రాంతి సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పేరంటం నిర్వహించి, పండ్లు, జాకెట్లు పంచిపెట్టారు. బంధుమిత్రులు బొమ్మల కొలువును సందర్శించారు.

'స్వర్ణాంధ్ర' సేవలు అభినందనీయం



యండమూరులో పేదలకు కళ్లజోళ్లు అందజేస్తున్న లయన్ రాంబాబు

కరప: పేదవర్గాల వారికి స్వర్ణాంధ్ర సేవా సంస్థ(రాజమహేంద్రవరం) ద్వారా నిర్వాహకుడు లయన్ గుబ్బల రాంబాబు స్వగ్రామం యండమూరులో చేస్తున్న సేవలు అభినందనీయమని వాణిజ్య పన్నుల అధికారి సాంబత్తుల వెంకట్రావు అన్నారు. యండమూరులో బుధవారం సంస్థ సమకూర్చిన రూ.25 వేల విలువైన కళ్లజోళ్లను 72 మందికి ఆయన పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుడు లయన్ రాంబాబు మాట్లాడుతూ, తమ సంస్థ స్థాపించి 27 ఏళ్లయిందని, ఇప్పటివరకు వెయ్యికి పైగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. ఈ నెల 8న గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, 18 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించి, మందులు అందించామన్నారు. 72 మందికి కళ్లజోళ్లు అందజేసినట్టు చెప్పారు. సర్పంచ్ మారెళ్ల శివ, గ్రామ పెద్దలు పెట్ట రాంబాబు, జనపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ



నడకుదురులో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

కరప: నడకుదురులోని జనావళి వృద్ధుల అనాథాశ్రమంలో బుధవారం సంక్రాంతిని పురస్కరించుకుని యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ 30 మంది వృద్ధులకు నూతన వస్త్రాలు, చీరలు అందజేశారు. సంస్థ సభ్యులు కె.కామేష్, కె.రామకృష్ణ, ఆర్.రమేష్, వి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దాత ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలు



నిరుపేదలకు వస్త్రదానం చేస్తున్న ఈఓ సత్యనారాయణమూర్తి

బోట్‌క్లబ్: ఉన్నతమైన దాత ఆశయాలకు అనుగుణంగానే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నదాన సమాజం ఈఓ పీవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. కోకనాడ అన్నదాన సమాజం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సినిమా రోడ్డులోని అన్నదాన సమాజంలో దాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి, పేదలకు వస్త్రదానం చేశారు. నగరంలో నిత్యం నిరుపేదలకు అన్నదానం చేయాలనే ఉద్దేశంతో దాతలు ఆర్‌వీకేఎం సూర్యారావు బహదూర్, కోట లక్ష్మయ్యనాయుడు ఈ అన్నదాన సమాజాన్ని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నిత్యం నిరుపేదలకు అన్నదానం చేస్తున్నట్టు వివరించారు. అనంతరం బ్రాహ్మణులకు స్వయంపాకం, పేదలకు వస్త్రదానం చేశారు.

నాలుగు ద్విచక్ర వాహనాలు దగ్ధం



దగ్ధమైన ద్విచక్రవాహనాలు

కాకినాడ క్రైం: నగరంలో ద్విచక్ర వాహనాలు దగ్ధం కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు, కొండయ్యపాలెంలోని ఓ ఇంటి ఆవరణలో పార్క్ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజాము సమయంలో తగులబెట్టారు. ఈ ఘటనలో రెండు వాహనాలు పూర్తిగా, మరో రెండు పాక్షికంగా దగ్ధమయ్యాయి. కుటుంబాల మధ్య వివాదాలే ఈ ఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ పుటేజీని పరిశీలించిన పోలీసులకు, ఓ మహిళ అనుమానాస్పద రీతిలో సంచరించడాన్ని గుర్తించారు. కాకినాడ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



బంగారు చీరలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



పతంగులతో చిన్నారుల సందడి



శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- నగరంలో ఘనంగా కనుమ పండగ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- సినిమా థియేటర్లు, పార్కుల్లో సందడి

బోట్‌క్లబ్: కనుమ పండగను బుధవారం ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. కొత్త దుస్తులు వేసుకొని, నగరంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా, సినిమాలకు వెళ్లడంతో నగరంలోని పలు థియేటర్లు సందర్శకులతో కిటకిటలాడాయి. సంక్రాంతికి కొత్త సినిమాలు విడుదల కావడంతో తమ అభిమాన హీరోల చిత్రాలు చూసేందుకు కుటుంబ సమేతంగా థియేటర్లకు రావడంతో, నగరంలో ఏ థియేటర్ వద్ద చూసిన ప్రేక్షకులు సందడి కనిపించింది. కాగా సంక్రాంతి పండగను పురస్కరించుకుని కాకినాడ బీచ్‌లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉప్పాడ కొత్తపల్లి నుంచి కాకినాడ సూర్యారావుపేట బీచ్ వరకు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో సందర్శకులు బీచ్‌కు రావడంతో సూర్యారావుపేట–ఉప్పాడ బీచ్ రోడ్డు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రత్యేక పూజలు

నగరంలోని సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు, గాంధీనగర్, జగన్నాథపురంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శిల్పారామంలో చిన్నారుల ఆటపాటలు

కిటకిటలాడిన పార్కులు

సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటిలో బంధువులతో కలిసి సాయంత్రం వేళ సేద తీరేందుకు ప్రజలు పార్కులకు చేరుకున్నారు. దీంతో నగరంలోని పలు పార్కులు సందర్శకులతో కిటకిటలాడాయి. చిన్న పిల్లలు పార్కుల్లో సందడి చేశారు. చిన్నారులు ఆడుకునే ఆట వస్తువుల వద్ద అధిక సంఖ్యలో గుమికూడారు. చిన్నారులను ఆడించేందుకు తల్లిదండ్రులు కూడా రావడంతో పార్కులు సందర్శకులతో కిక్కిరిశాయి.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కాకినాడ రూరల్: సంస్కృతీ సంప్రదాయాల సమాహారం శిల్పారామమని శిల్పారామం ఇంచార్జి పరిపాలన అధికారి, సి.మోహన్ తేజ తెలిపారు. కాకినాడ బీచ్ రోడ్డులోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు–2025 ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అందులో భాగంగా మకర సంక్రాంతి రోజున చిన్నపిల్లలకు గాలిపటాలు పంపిణీ చేసి, వారిలో నూతనోత్తేజం నింపారు. అనంతరం శ్రీవాగ్దేవి నృత్య నికేతన్, కాకినాడ కల్యాణి తేజేశ్వరరావు బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. కనుమ రోజున శ్రీవైష్ణవి నాట్యాలయం, వేళంగి, భాను ప్రమీల బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. కాకినాడ పట్టణ, గ్రామీణ ప్రజలు కుటుంబ సమేతంగా శిల్పారామానికి విచ్చేసి పండగ జరుపుకొన్నారు.

'బరి' తెగింపు

- జోరుగా కోడిపందేలు, గుండాట
- భారీగా చేతులు మారిన నగదు

కాకినాడ రూరల్: సంక్రాంతి పండగ మూడు రోజులూ కాకినాడ రూరల్‌లో కోడి పందేలు, గుండాట భారీగా జరిగాయి. కూటమి నేతల నేతృత్వంలో బరి తెగింపుగా పందేలు నిర్వహించారు. భోగి నుంచి ప్రారంభమైన కోడి పందేలు కనుమ నాడు బుధవారం సాయంత్రం వరకు విచ్చలవిడిగా జరిగాయి. మండలంలోని తిమ్మాపురం, సర్పవరం, పండూరు, నేమాం, సూర్యారావుపేట, వాకలపూడి, వలసపాకల, కొత్తూరు, చీడిగ, తూరంగి గ్రామాలతో పాటు, అర్బన్ పరిధిలో గైగోలుపాడు, గుడారిగుంట వద్ద కోడి పందేలను విస్తృతంగా నిర్వహించారు. పందేల మాటున గుండాట జరగడంతో జనం తమ జేబులు గుల్ల చేసుకున్నారు. మూడు రోజుల పాటు కోట్ల రూపాయలు చేతులు మారినట్టు తెలిసింది.



కాకినాడ రూరల్‌లోని పండూరులో జరుగుతున్న కోడి పందేలు

సైనికుల త్యాగాలు మరువలేనివి



మాజీ సైనికోద్యోగి నగేష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ అడ్డాల, అడబాల తదితరులు

కాకినాడ రూరల్: దేశ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనిక శక్తుల త్యాగాలు నిరుపమానమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో త్రివిధ సైనిక దళాల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం దేశ క్షేమం కోసం ఆలోచిస్తూ, శత్రువుతో పోరాడుతూ, ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకు దూసుకుపోగల సత్తా మనుకుందన్నారు. మాజీ సైనిక ఉద్యోగి ఎస్.నగేష్ మాట్లాడుతూ, పాకిస్తాన్, చైనా దురాక్రమాలను అరికట్టిన మన సైనికులు.. తుఫాన్ సహాయక చర్యల్లో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడుతున్నారని వివరించారు. అనంతరం నగేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ జాబ్‌మేళాలో 187 మంది ఎంపిక

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9వ తేదీన అమర్‌రాజా గ్రూప్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 187 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌వర్మ బుధవారం తెలిపారు. ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ఉత్తీర్ణత కలిగి, ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగి ఉన్న అభ్యర్థులు హాజరు కాగా, అర్హతల మేరకు ఎంపిక చేసి కంపెనీ ఆఫర్ లెటర్లు అందజేసినట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, టీపీఓ బృంద సభ్యులు అభినందనలు తెలిపారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

కరప: క్రికెట్ అసోషియేషన్ ఆఫ్ కరప(సీఏకే) ఆధ్వర్యంలో స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్–2025 పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో వేళంగి–2, జెడ్.భావారం జట్లు తలపడ్డాయి. జెడ్.భావారం జట్టు 21 పరుగుల తేడాతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో సీఏకే–11 జట్టుపై, గురజనాపల్లి జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో వేళంగి–1 జట్టుపై, కరప వారియర్స్ జట్టు 8 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. నాలుగో మ్యాచ్‌లో కరప రాక్స్, పెద్దాపురప్పాడు జట్లు పోటీ పడ్డాయి. పెద్దాపురప్పాడు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సీఏకే సభ్యులు పోలిశెట్టి సునీల్, నక్కా భీమ్, ఎం.దుర్గాకిరణ్ పోటీలను పర్యవేక్షించారు.



కరప హైస్కూలులో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

కోడి పందేలు, గుండాటపై దాడులు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు, గుండాట నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో బుధవారం కరప పోలీసులు దాడులు నిర్వహించి, 38 మందిని అరెస్టేట్ చేశారు. వీరి నుంచి రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కరప ఎస్సై టి.సునీత వివరాల మేరకు, పలు గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో పోలీసులు ఈ దాడులు చేశారు. యండమూరు, వేళంగి, విజయరాయుడుపాలెం, గొర్రిపూడి, గురజనాపల్లి, వేములవాడ తదితర గ్రామాల్లో కోడిపందేలు గుండాట శిబిరాలపై ఎస్సై సునీత, ఏఎస్సై వి.సూరిబాబు తమ సిబ్బందితో దాడి చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

మెల్విన్ జోన్స్ చిరస్మరణీయుడు

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌ను స్థాపించిన మెల్విన్ జోన్స్ చిరస్మరణీయుడని క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. స్థానికంగా బుధవారం మెల్విన్ జోన్స్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జయంతి కార్యక్రమాన్ని భారీఎత్తున చేసిన క్లబ్ కో–ఆర్డినేటర్ మెట్ల రాధా సరస్వతిని అభినందించారు. అనంతరం కార్యక్రమానికి వ్యాఖ్యతగా వ్యవహరించిన సుచిత్రను, రీజనల్ చైర్‌పర్సన్ పున్నమిరాజును సత్కరించారు. లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

కాకినాడ రూరల్: రమణయ్యపేట కూరగాయల మార్కెట్‌లో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. చేపల మార్కెట్‌ను ఆనుకుని ఉన్న కూరగాయల మార్కెట్‌లో మంటలు వస్తుండగా స్థానికులు నియంత్రించారు. ఇలాఉండగా షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం వాటిల్లినట్టు స్థానికులు భావిస్తున్నారు.

మకర సంక్రమణం.. భానోదయ కటాక్షం



సంక్రాంతి రోజున కాకినాడ కుంభాభిషేకం వద్ద సూర్యోదయం

కాకినాడ రూరల్: తెలుగింట పెద్ద పండగగా జరుపుకొనే సంక్రాంతి నాడు సూర్యుడు సాగర నగరం కాకినాడలో భానోదయపు కాంతులతో కనువిందు చేశాడు. సూర్యుడు మకర సంక్రమణం రాశి మారుతున్న వేళ.. వేకువజామునే పెద్ద పరిమాణంలో కనువిందు చేయడంతో కుంభాభిషేకం రేవు వద్ద పలువురు ఆదిత్యుడికి నమస్కారాలు చేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

బోట్‌క్లబ్ : సంక్రాంతి సందర్భంగా బీజేపీ సౌత్ మండల అధ్యక్షుడు చెక్క రమేష్ ఆధ్వర్యంలో స్థానిక 27వ డివిజన్‌లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక కాపుల వీధి, వివేకానంద వీధుల్లో నిర్వహించిన ఈ పోటీలలో 150 మంది మహిళలు తమ ముగ్గులతో ఆకట్టుకున్నారు. పోటీలకు బీజేపీ మహిళామోర్చా నాయకురాలు తుమ్మల పద్మజ, గూడూరు పద్మ అతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో సున్నం వీరవెంకట జలకన్య, కండిపిల్లి మాధవి, ఊద నాగశ్రీదేవి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.



ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

గోమాత సర్వ దేవతా స్వరూపం

బోట్‌క్లబ్: నగరంలోని పలు ఆలయాల్లో గోపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పశువుల పండగగా ప్రసిద్ధిగాంచిన కనుమ రోజున గోమాతను పూజిస్తే సకల సుఖాలు లభిస్తాయనే ఉద్దేశంతో బుధవారం ఆలయాల్లో గోపూజ చేశారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. గోమాత సర్వదేవతా స్వరూపమని కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయ ప్రధానార్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం అన్నారు. గోపూజ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోసేవ చేసేవారికి గ్రహదోషా నివారణ, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గోసేవ, గోదానం సర్వపాప హరణమన్నారు. స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో గోపూజ ఘనంగా జరిగింది. ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పండితులు ఈ పూజలు నిర్వహించారు. దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో పాటు, పలు ఆలయాల్లో గోపూజలు జరిగాయి.



బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గోపూజలో పాల్గొన్న భక్తులు

సేవకు రెడ్ కార్పెట్

- సేవా బాటలో కాకినాడ రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు
- 8 ఏళ్లలో రూ.1.10 కోట్ల సహకారం
- విద్యకే అధిక ప్రాధాన్యం ఇస్తున్న సభ్యులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నాలుగు దశాబ్దాల క్రితం పదో తరగతి పూర్తి చేసి, దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా గోవాలో కలిశారు. విద్యార్థి దశలో అనుభవించిన ఇబ్బందులు కొందరు తలచుకుని, ఈనాటి సుఖసంతోషాలకు ఆనాడు పడిన కష్టమే కారణంగా భావించారు. సమాజంలోని వివిధ వర్గాల వారు ప్రస్తుతం పడుతున్న కష్టాలను మరికొందరు ప్రస్తావించారు. తమ ఉన్నతికి కారణమైన సమాజానికి ఏదో చేయాలని చర్చించుకున్నారు. చివరకు తాము చదివిన రెడ్ కాన్వెంటు నేటి తరానికి గుర్తు చేసేలా ఆనాటి మిత్ర బృందమంతా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్(1978) పేరిట విస్తృత సేవా, సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు.

నగరంలోని దేవదాయ శాఖ కార్యాలయం వద్ద ఉన్న భవనంలో ఒకప్పుడు చిల్డ్రన్స్ ఐడియల్ పాఠశాల పేరుతో రెడ్ కాన్వెంట్ నిర్వహించేవారు. ఈ పాఠశాలలో 1978లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా ట్రస్టు ఏర్పాటు చేయాలని బెంగళూరులో నివసిస్తున్న పారిశ్రామికవేత్త బచ్చు కమలబాబు ఆకాంక్షించారు. ఈ కాన్వెంట్లో చదివి ప్రస్తుతం పుదుచ్చేరి, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాల్లో ఉన్న మిత్ర బృందం ఆయనను ప్రోత్సహించారు. దీంతో గత ఏడాది 80 మంది సభ్యులుగా రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్(1978) చారిటబుల్ ట్రస్టు ఏర్పాటైంది. అందరికీ విద్య, సంపూర్ణ వైద్యం, పేదలకు ఆరోగ్యం అనే విధానంతో ముందుకు సాగుతున్నారు. దీంతో పాటు తమకు చదువు చెప్పిన గురువులు, ఆనాటి పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో రూ.1.10 కోట్లతో 562 సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

ట్రస్టు తరఫున పూర్వ విద్యార్థులంతా కలిసి నగరంతో పాటు, పలు ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో బాలింతలు, అప్పుడే పుట్టిన పిల్లలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, మాతా, శిశు విభాగానికి వాటర్ హీటర్లు, ఫ్యాన్లు అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన మామిడి బాలాజీ అనే నిరుపేదకు కిడ్నీ మార్పిడికి, అనంతరం మందుల కొనుగోలుకు రూ.1.50 లక్షల సాయం అందజేశారు. బాదం బాబు కృష్ణ క్లాత్, కళ్లజోళ్ల ప్రాజెక్టుకు రూ.6 లక్షలు అందజేశారు. మెడిసిన్, ఇంజినీరింగ్ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి రూ.6.5 లక్షలతో 10 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. రూ.5 లక్షలతో సాలిపేట బాలికల పాఠశాలకు చెందిన 1180 మంది విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్ల పంపిణీ, వీరికి ఏటా ఉచితంగా బస్సు పాసులు, గిరిజన బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఇలా సేవా కార్యక్రమాలతో అందరి మన్ననలు అందుకుంటున్నారు.



ట్రస్ట్ ద్వారా సాయం చేస్తున్న సభ్యులు

మా వంతుగా..



రెడ్ కాన్వెంట్‌లో పదో తరగతి పూర్తి చేసిన మా బృందమంతా పాఠశాల పేరు చిరస్థాయిగా నిలవాలనుకున్నాం. ట్రస్టును ఏర్పాటు చేసి మా వంతుగా సమాజ సేవకు శ్రీకారం చుట్టాం. ఈక్రమంలో పేద విద్యార్థులకు, రోగులకు, వృద్ధులు ఇలా పలు విభాగాల వారికి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మా మిత్ర బృందమంతా సేవా కార్యక్రమాల కోసం తమ సంపాదనలో కొంత భాగాన్ని ట్రస్టుకు కేటాయించడం సంతోషంగా ఉంది. పారిశ్రామిక వేత్త బచ్చు కమలబాబు ట్రస్టు వ్యవస్థాపకుడుగా ఉన్నారు.

– బాదం బాలకృష్ణ, ట్రస్టు చైర్మన్

ఏటా రూ.లక్ష సాయం



దేవుని అనుగ్రహం, దైవ సాయం ఎలా లభిస్తుందన్నది నేను ప్రత్యక్షంగా రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ 1978 చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చూశాను. వారు నా ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, నా వైద్య, విద్యకు సాయంగా నిలిచారు. నాకు ఏటా రూ.లక్ష చొప్పున నాలుగేళ్లు ఆర్థికంగా సాయం చేశారు. నా ఇంటర్న్‌షిప్‌లో రూ.లక్ష సమకూరుస్తామన్నారు. నాలాంటి ఎంతో మంది విద్యార్థులకు సాయంగా నిలిచి, వారి బంగారు భవిష్యత్తుకు చేయూతనిస్తున్న ట్రస్ట్‌కు, అందులో భాగస్తులైన వారికి నా కృతజ్ఞతలు.

– మల్లాడి ఆకాష్, కాకినాడ

సాయం పొంది.. తిరిగి చేస్తున్నా..



మా కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లున్నాం. నేను పెద్దదాన్ని. నా విద్యాభ్యాసంలో కీలక మలుపు తిప్పింది రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ ట్రస్ట్(1978) అందించిన అండదండలే. వారి సాయంతో నేను ఒడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసి, డీఎక్స్‌సీ టెక్నాలజీ అనే ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం పొందాను. మా కుటుంబ పరిస్థితులను మెరుగుపరచడంలో ఈ ట్రస్ట్, బాదం బాలకృష్ణ చేసిన సాయం మరువలేనిది. నా కెరీర్‌లో కొంత స్థిరత్వం పొందిన తర్వాత, నేను నా వంతుగా రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ ట్రస్ట్ 1978కు ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందిస్తున్నాను. నా జీవితానికి వెలుగునిచ్చిన వారిని మరువరాదనే చిన్న ప్రయత్నం.

– నూలు నవ్యశ్రీ, కోనసీమ జిల్లా

ట్రస్ట్ ద్వారా డాక్టర్ అయ్యాను



నా తండ్రి పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జీఎస్ఎల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ప్రతి ఏడాది రూ.1.16 లక్షల చొప్పున ట్రస్ట్ ద్వారా నాలుగేళ్లు సాయం అందించారు. జీవితంలో స్థిరపడ్డాక ఇటువంటి ట్రస్ట్‌కు సహకారం అందిస్తాను.

– నక్కా సరస్వతి, కాకినాడ

నెలకు రూ.8 వేల సంపాదన



ట్రస్ట్ ద్వారా నాకు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టుమెషీన్ సాయం చేశారు. ఇప్పుడు ప్రతి నెలా రూ.8 వేల వరకు ఆదాయం పొంది, కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను. ఇటువంటి ట్రస్ట్‌ల ద్వారా వందలాది మహిళలు ఉచితంగా కుట్టు శిక్షణ పొందుతున్నారు.

– బి.సరస్వతి, కాకినాడ